క్లుప్తంగా

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.46 కోట్లు

శ్రీకాళహస్తి: ముక్కంటీశునికి 40 రోజులకు సంబంధించి హుండీ ఆదాయం రూ.2.46 కోట్లు సమకూరినట్లు ఆలయ ఈఓ బాపిరెడ్డి చెప్పారు. గురువారం ఆలయ ప్రధాన హుండీ, పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయం లెక్కించారు. నగదుతోపాటు బంగారం 62 గ్రాములు, వెండి 635 కేజీలు, పలు దేశాల కరెన్సీ నోట్లు 198 వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. గత నెల 4వ తేదీ నుంచి ఇప్పటి వరకు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా దోపోత్సవం



శ్రీకాళహస్తి: పట్టణంలో స్వామి అమ్మవార్ల దొంగ దోపోత్సవం గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయంలో ఈ ఉత్సవం ప్రత్యేకంగా నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి గర్వభంగం కలిగించడానికి చండీకేశ్వరుడు చేత ఆమె బంగారు నగలను దొంగతనం చేయించి శివుడు.. పార్వతితో కలిసి ఆయన వెంట దొంగ దొంగ అని అరుస్తూ చెన్నకేశవుడి వెంట పడినట్లు పురాణ ప్రశస్తి. దీనిని గుర్తు చేస్తూ నిర్వహించిన ఈ ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది.

బర్డ్‌ఫ్లూ ఇక్కడ లేదు..



సునీత

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఉభయ గోదావరి జిల్లాల్లో కోళ్లకు సోకిన బర్డ్‌ఫ్లూపై మన ప్రాంత ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని రేణిగుంట, ఏర్పేడు మండలాల పశు వైద్యశాలల అసిస్టెంట్ డైరెక్టర్ సునీత తెలిపారు. గురువారం రేణిగుంటలోని పశు వైద్యశాలలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రేణిగుంట మండలంలో ఏడు కోళ్ల ఫారాలు ఉన్నాయని, వీటిలో సుమారు 7 లక్షల కోళ్లను పెంచుతున్నారన్నారు. ప్రతి రెండు రోజుల కోసారి పశు వైద్యులు కోళ్ల ఫారాలను పరిశీలిస్తున్నారని, మన ప్రాంతంలో కోళ్లకు ఎలాంటి వైరస్ లేదని, ప్రజలు నిర్భయంగా చికెన్, కోడిగుడ్లు ఆహారంగా తీసుకోవచ్చన్నారు. కోడి మాంసాన్ని, కోడిగుడ్లను పూర్తిగా ఉడకపెట్టిన తర్వాత తినాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులకు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట(ఏర్పేడు): సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని నీలాద్రి గృహ సముదాయంలోని ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు, మహిళా రక్షణ చట్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏర్పేడు సీఐ జయచంద్ర పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

- పొయ్య, రౌతు సూరమాలలో విశేష స్పందన



స్క్రీనింగ్ చేస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం తొట్టంబేడు పీహెచ్‌సీ పరిధిలోని పొయ్య సచివాలయం, రౌతు సూరమాల సచివాలయంలో క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. రక్తపోటు, మధుమేహం పరీక్షలతో పాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. 14న పెద్ద కన్నలి, బసవయ్యపాలెం, 17న సాంబయ్యపాలెం, తొట్టంబేడు–2, 18న శివనాథపాలెం, చిట్టత్తూరు, 20వ తేదీ కాంచనపల్లెలో స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తొట్టంబేడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లహరిణి, స్విమ్స్ మెడికలాఫీసర్లు డాక్టర్ చైతన్యభాను, డాక్టర్ హరిత, ఎంపీపీ వాసుదేవనాయుడు, సర్పంచులు కె.సక్కుబాయమ్మ, మాధవి, పావనిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డి.మురళి, మణి, జ్ఞానప్రకాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి సార్!



శ్రీకాళహస్తి: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆలయ ఈఓ బాపిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఏర్పాట్ల గురించి ఆయనకు వివరించారు.

చిచెత్తశుద్ధి లేని అధికారులు..!

పారిశుధ్యం మెరుగు, చెత్త నుంచి సంపద తయారీ గురించి పంచాయతీ కార్యదర్శులకు జిల్లా అధికార యంత్రాంగం ఎన్ని శిక్షణా తరగతులు నిర్వహించినా కొందరికి చెవిటి వాడి ముందు శంఖం ఊదిన చందాన ఉంటోంది. దీనికి రేణిగుంట మేజర్ పంచాయతీ కేంద్రాన్ని చూస్తే ఇట్టే బోధపడుతుంది. పారిశుధ్యం సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి.



రేణిగుంట ఫ్లై ఓవర్ కింద ఉన్న చెత్త కుప్ప



బిస్మిల్లానగర్‌లో ఇలా..

- రేణిగుంటలో తిష్ట వేసిన పారిశుధ్యం సమస్యలు
- కార్యరూపం దాల్చని చెత్త నుంచి సంపద కేంద్రాలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఉమ్మడి జిల్లాలో ప్రాముఖ్యం కలిగిన మేజర్ పంచాయతీల్లో రేణిగుంట ఒకటి. రైల్వే జంక్షన్‌గా కూడా ఉండడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తూంటారు. ఒక వారపు సంతరోజైన శనివారం చిన్నపాటి తిరునాళ్లను తలపించేలా ఉంటుంది. పైగా ఎండు చేపల మార్కెట్‌కు ఎంతో ప్రసిద్ధి. సుమారు 70 వేల మంది జనాభా కలిగి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన పంచాయతీలో పారిశుద్ధ్య సమస్యలు తాండవిస్తున్నాయి. 90 మంది పారిశుద్ధ్య కార్మికులు, వారి పర్యవేక్షణకు ఒక మేస్త్రి, ఒక శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, అలాగే ఈఓ సైతం ఉన్నారు. అయినా కూడా పట్టణంలో ఎక్కడ చెత్త అక్కడే అన్న చందాన కొన్ని ప్రాంతాల్లో ఉంటోంది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి తిరుపతి జిల్లా వ్యాప్తంగా 608 సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుడుతున్నారు. దీనికి సంబంధించి బుధవారం కరకంబాడిలో రేణిగుంట, ఏర్పేడు మండలాల పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులకు ప్రత్యేక శిక్షణ సైతం ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి వారికి మార్గదర్శనం చేశారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడా చెత్తకుప్పలు కనపడకుండా పనిచేయాలని ఆదేశించారు. కానీ రేణిగుంట పంచాయతీ అధికారులకు డీపీఓ హితబోధ చెవినపడనట్టుంది. గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా రేణిగుంటలో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. మంచి నీళ్ల కుంట ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారి, ఫ్లై ఓవర్ కింద, బిస్మిల్లా నగర్ తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తాయి. మరోవైపు పంచాయతీలో పెద్ద మొత్తంలో వెలువడే చెత్త నుంచి సంపద కేంద్రాల వైపు మళ్లించి, వర్మీ కంపోస్టు తయారు చేస్తే పంచాయతీకి ఇదొక ఆదాయ వనరుగా కూడా అవుతుంది. ఆ దిశగా కార్యాచరణకు పూనుకుని పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగి చేతివాటం

నాగలాపురం: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగలాపురం బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్ తన చేతివాటం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ క్యాడర్‌లో పని చేస్తున్న సూర్య తేజ్ బ్యాంకులో ప్రజలు తాకట్టు పెట్టిన బంగారు నగలను బ్యాంకులో భద్రపరిచిన లాకర్ నుంచి బయటకు తీసుకొచ్చి అదే నగలపై రొటేషన్ పద్ధతిలో అక్రమ రుణాలు పొందాడు. అయితే ఆడిట్‌లో తాకట్టుకు వచ్చిన రుణాలకు సంబంధించిన బంగారు నగలు లాకర్‌లో కనిపించలేదు. దీంతో ఆడిట్ కొచ్చిన అధికారులు లోతుగా విచారణ చేయగా ఇది ఇంటి దొంగ పనే అని బ్యాంకులో పనిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ చేతివాటంగా గుర్తించారు. దీనిపై రెండు రోజుల క్రితం సత్యవేడు పోలీసు సర్కిల్ ఆఫీసులో సంబంధిత యూనియన్ బ్యాంకు అధికారులు అక్రమ రుణాల విషయం గురించి చర్చించారు. అయితే బ్యాంకు పైస్థాయిలో సంప్రదింపులు జరిపి, పూర్తి స్థాయి ఆడిట్ నివేదికలో జరిగిన గోల్‌మాల్‌ను లెక్కగట్టి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపినట్లు సమాచారం. మరో రెండు రోజులు గడిస్తేకానీ అక్రమ రుణాల తంతుపై పూర్తి స్థాయి నివేదిక వచ్చే పరిస్థితి లేదు. యూనియన్ బ్యాంకు చరిత్రలో ఈ తరహా అక్రమాలు ఇదే ప్రథమమని ఆ బ్యాంకు అధికారులు చర్చించుకోవడం గమనార్హం. ఈ సమాచారం అందుకున్న ఖాతా దారులు నగలు తాకట్టు పెట్టిన సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

మాజీ సర్పంచ్ రమణయ్య మృతి తీరని లోటు

- మృతదేహానికి నివాళులు అర్పించిన నూకతోటి రాజేష్



రమణయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న నూకతోటి రాజేష్, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుగ్గిళ్ల రమణయ్య (47) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణినాయుడు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేశారని, ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని రాజేష్ భరోసా ఇచ్చారు. అనంతరం పల్లమాలలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పెంచలయ్య తల్లి తుమ్మూరు సుబ్బమ్మ కర్మక్రియలకు హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, ఉగ్గమూడి గురునాథం, నాయకులు మునిరెడ్డి, గురవయ్య, సంజీవయ్య, దేవదాసురెడ్డి, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కరానికి చొరవ చూపాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఐకేపీ ఏపీఎం మునెయ్య, ఏపీఓ భానుప్రియ, ఏఓ భారతి, పీఆర్ ఏఈ నాగరాజుతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, వేసవి కాలం మొదలు అవుతుండడంతో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా బోరు మోటారు, పైపులైన్లు, చేతిపంపుల సమస్యలు ఉన్నపక్షంలో మరమ్మతులు చేయించాలన్నారు. స్కూళ్లలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టేలా దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

స్వర్ణముఖిలోకి మురుగు నీరు..!



- మాట తప్పిన కూటమి నేతలు
- అధికారంలోకి వస్తే నది ప్రక్షాళన చేస్తామని అప్పట్లో నానాయాగీ చేసిన వైనం
- మండిపడుతున్న భక్తులు, స్థానికులు



స్వర్ణ ముఖిలోకి కలిపిన మురుగు నీటి కాలువలు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న వేళ స్వర్ణముఖి నదిలోకి మురుగు నీరు కలిసేలా కాలువలను ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు గతంలో స్వర్ణముఖిలోకి మురుగు నీరు వదిలేస్తున్నారని నానాయాగీ చేశారు. అంతేకాకుండా తాము గెలిస్తే మురుగునీరు కలవనీయమని, స్వర్ణముఖి నది ప్రక్షాళన చేస్తామని ఊదరగొట్టారు. తీరా ఇప్పుడు దీనికి భిన్నంగా పనులు చేయడంపై ప్రజలు విస్తుపోతున్నారు. మురుగు నీటిని పైపులు ద్వారా ఆనకట్ట వద్దకు తరలించేలా ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు వీరంతా ఆర్భాటంగా ప్రకటించారు. ఇప్పుడు నేరుగా నదిలోకే కలపవడంతో మురుగు నీరు స్నానఘట్టాల వద్దకు చేరుకుంటుందని, ఆ నీటిలోనే భక్తులు స్నానం చేసే దురవస్థ కలనుందని పలువురు మండిపడుతున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ





మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి, నాగలాపురం: మాట్లాడుతున్న సూపర్ వైజర్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు సామర్థ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసీడీపీఓ దేవకుమారి మాట్లాడుతూ, పోషణ్ భీ పడై భీ పేరిట మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సూపర్‌వైజర్ యమున, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం మొదలైంది. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, అధికారులు మాట్లాడారు. తొలిరోజు బాల్యవిద్య ప్రాముఖ్యత, పిల్లల ఆకాంక్షలను అర్థం చేసుకోవడానికి సమూహ కార్యకలాపాలు, హేతుబద్ధీకరణ తదితర అంశాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ క్రిష్ణమంజరి

ఏర్పేడులో..

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రేణిగుంట సీడీపీఓ క్రిష్ణమంజరి శిక్షణ తరగతులు ప్రారంభించారు. బిడ్డ ఆరోగ్యం, ప్రీస్కూల్ ప్రాముఖ్యత, దివ్యాంగ పిల్లల గుర్తింపు ..ఇత్యాది అంశాలపై ఆమె మాట్లాడారు. ప్రగతి మండల కో–ఆర్డినేటర్ శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

22 వరకు న్యాయ వారోత్సవాలు

- ప్రత్యేక ప్రతిభావంతులు, బుద్ధిమాంద్యుల స్థితిగతులపై సర్వే



బాబుని పరిశీలిస్తున్న న్యాయ సేవాసంఘం

శ్రీకాళహస్తి: నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీ వరకు న్యాయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు న్యాయ సేవా సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం నుంచి వీటిని ప్రారంభించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రత్యేక ప్రతిభావంతులు, బుద్ధిమాంద్యులను గుర్తించి, వారి స్థితిగతులు, సమస్యలను తెలుసుకుని జిల్లా జడ్జి దృష్టికి తీసుకెళ్తామన్నారు. గురువారం స్థానిక తుపాన్ సెంటర్లో ఐదేళ్ల బుద్ధిమాంద్యం బాలుడిని గుర్తించినట్టు చెప్పారు. అతడు జన్మించిన రెండో రోజు నుంచి జ్వరం ఎక్కువై, మూర్ఛ వచ్చి మెదడుపై ప్రభావం చూపడంతో బుద్ధిమాంద్యం సమస్య తలెత్తినట్టు తెలుసుకున్నామని, ఆ బాలుడికి వైద్య సహాయం అందేలా చూడాలని ఆశావర్కర్లకు సూచించినట్టు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు గుమ్మల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, శ్రీరాం, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయ రికార్డుల్లో లేనివారిని గుర్తించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: పంచాయతీల పరిధిలో నివసిస్తున్నప్పటికీ గ్రామ సచివాలయాల రికార్డుల్లో లేనివారిని గుర్తించాలని ఎంపీడీ చంద్రశేఖర్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమీక్షించారు. ప్రభుత్వం ఇచ్చిన అన్ని సర్వేలు, టార్గెట్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నెలలో 3వ శనివారం తడి, పొడి చెత్త, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహా శివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ



నాగలాపురం: పిచ్చాటూరు మండలం రామగిరిలోని శ్రీ వాలీశ్వరస్వామిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం ఉదయం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఈఓ లతతో కలిసి మహా శివరాత్రి బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పిల్లల భవితకు అంగన్‌వాడీల్లో పునాది

- అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ప్రారంభంలో డీవైఈఓ ప్రభాకర్‌రాజు



మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

నారాయణవనం: పిల్లల భవితకు అంగన్‌వాడీ కేంద్రంలోనే గట్టి పునాదులు వేయాలని, ఈ దిశగా పిల్లలకు పోషక విలువలు, చదువు ఆవశ్యకతను చాటి చెప్పడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు పిలుపునిచ్చారు. పోషన్ బీ–పడావ్ బీ¶ అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డీవైఈఓ మాట్లాడారు. చదువుతో పాటు ఆహారపు అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వైద్యాధికారి దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ, రక్తహీనతకు గురవుతున్న పిల్లలపై దృష్టిని సారించి, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కిశోర బాలికలు, వారి తల్లులకు సమావేశాలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంచాలని కోరారు. సమావేశంలో హెచ్ఎం శశికళ, సూపర్‌వైజర్ బేబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభదశలో గుర్తిస్తే కుష్ఠు నివారణ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ తదితరులు

- ముగిసిన పక్షోత్సవాలు
- పలుచోట్ల అవగాహన సదస్సులు

శ్రీకాళహస్తి: కుష్ఠు వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమేనని, చికిత్సతో అంగవైకల్యం బారినపడకుండా చేయవచ్చని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ యస్.జోబు అన్నారు. కుష్ఠు వ్యాధిపై నిర్వహిస్తున్న అవగాహన పక్షోత్సవాలు గురువారం ముగిశాయి. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, భాస్కరపేట, సాలిపేట, శ్రీరామనగర్ కాలనీలోని జెడ్పీ హైస్కూల్, బీపీ అగ్రహారం, మున్సిపల్ ఉన్నత పాఠశాల భాస్కరపేట, మున్సిపల్ ఉన్నత పాఠశాల బాబు అగ్రహారంలో సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ పారా మెడికలాఫీసర్ మాట్లాడారు. అనంతరం 2029 నాటికి కుష్ఠు రహిత దేశంగా తీర్చిదిద్దడంతో తమ వంతు పాత్ర పోషిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మూడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

- వీఆర్‌ఓలకు తహసీల్దార్ హెచ్చరిక



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ రెవెన్యూ అధికారుల పనితీరు బాగోలేదని, వారు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దారు సుబ్రమణ్యం హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందికి తహసీల్దార్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులపై విచారణ చేసి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. భూసమస్యల పరిష్కరంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేకించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, మండల సర్వేయర్ ప్రకాష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై 'యూనిచామ్'లో అవగాహన సదస్సు

సత్యవేడు: వాహనాలు నడిపే డ్రైవర్లు రోడ్డు మలుపుల వద్ద వేగాన్ని తగ్గించి, హారన్ ఇస్తూ నడపాలని పుత్తూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం శ్రీసిటీలోని యూనిచామ్ కర్మాగార ప్రాంగణంలో డ్రైవర్లు, లాజిస్టిక్ మేనేజర్స్, ప్లాంట్ మేనేజర్లుతో రహదారి భద్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే నియంత్రణ కోల్పోయి రోడ్డు ప్రమాదాల బారి పడతారని హెచ్చరించారు. రోడ్డుపై నడుస్తున్న పాదచారులు, వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ సిగ్నల్స్ అనుసరించాలన్నారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మొబైల్ ఫోన్లు వినియోగించరాదని, రాత్రి వేళ ఎదురుగా వచ్చే వాహనాలకు డిమ్ అండ్ డిప్ వేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలన్నారు.

14న నెల్లూరులో పీడీఎస్‌యూ విలీన సభ



పీడీఎస్‌యూ విలీన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పీడీఎస్‌యూ విలీన సభను జయప్రదం చేయాలని డివిజన్ నాయకుడు మణి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. 1974 అక్టోబర్ 12న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ఏర్పడిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) 2013లో రెండుగా చీలిందని, ప్రస్తుతం రెండు కార్యవర్గాలు నెల్లూరు నగరంలో ఈనెల 14న విలీన సభ నిర్వహిస్తున్నాయని మణి తెలిపారు. ఈ చరిత్రాత్మకమైన ఘట్టాన్ని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో నిరుద్యోగం, అవినీతి పెరిగిపోయిందన్నారు. యూజీసీ నియమ నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకుని ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల్లో మతోన్మాద నిలయాలుగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. నెల్లూరులో 14వ తేదీ నిర్వహించనున్న విలీన సభలో విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు యువత, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.